నీలవేణి

రాయసం వెంకటశివుడు

౧

సముద్రతీరమందలి యిసుకయెడారి జనుల కేమంత వాసయోగ్యముగ నుండును? వేసవిని జాముప్రొద్దెక్కినది మొదలు సాయంకాలమువఱకును సూర్యుని ప్రచండకిరణములకు కాలికాలిన యిసుక బయలునుండి వేడిమి పైకెగయుచుండును. అచ్చటచ్చట గానవచ్చెడి యుడిగిపోయిన మొలకలు మొదలును ఎండనుండి తలదాచుకొనుటకు జనుల కుపకరింపవు. జిహ్వకు రుచిగ ద్రావుటకు దగినంత మంచినీరు దొరకదు. సూర్యాస్తమయసమయమునకు చల్లగాలి తిరుగుట నిజమె. కాని, నిరతము, ఆప్రదేశభూమి నివాసముగ జేసికొనినవారికి, ఏదోసమయమున విహారార్థ మచటి కేతెంచువారలకువలె, అందలి జీవిత మంతగ సుఖప్రదముగ నుండదు. స్వానుభవమున వారికి స్పష్టముగ గానబడునవి కాలుచుండెడి యిసుకయెడారియు, చెవులు చిల్లులుపడునట్టుగ నిరతము తీరమును మోదెడి యలల చప్పుడును- సముద్రతరంగములనుండి వీతెంచు శీతలవాయువులు సంసార సౌఖ్యసంపదలవలెనే వారికి క్షణభంగురమగుచుండును.

ఐనను, రాత్రిలోని కప్పకు రాత్రిలోనె జీవితము గడచిపోవుచుండును. నీలమ్మకు నీలివాడనివాసము అనుకూలముగనే యున్నది. నావవేసికొని తండ్రియు, నన్నయు సముద్రముమీద బోయి, చేప జెల్లలు పట్టుకొని, సంసారము గడపుకొనుటకు పడు కష్టము లాబాలకేమి తెలియును? నీలమ్మయు, తమ్ముడును ఇంటిపనులు నెరవేర్చు తల్లికిగాని దోనెపనిమీద నుండు అన్నయ్యలకుగాని, చేయుసాయ మంతగ లేదు. అక్కతమ్ములు, ఒకరినొకరు చెట్టపట్టుకొని, సాయంకాలము సముద్రపుటొడ్డున కేగి, అచట తేనెగవ్వలు, గంగాళువచిప్పలు చేరికొనుచును, తా మిసుకలో దీర్చి కట్టిన బొమ్మరిండ్లను పెద్దకెరటమువచ్చి లాడ్చివేయగా కేకలువేయుచు క్రొత్తయిండ్లు మరలమరల గట్టుచును కాలము గడుపుచుందురు. గోలీల యాట, గాలిపడగ లెగురవేయుట,—ఇవియె వారికిని, ఆపల్లెయందలి యితరపిల్లలకును ముఖ్యకాలక్షేపములు.

౨

'ఓడలు బండ్లగును, బండ్లోడలగును.' కాల వైపరీత్యముననను, గాంధీమహాత్ముని కార్యశూరత్వమహిమముననను పల్లెలు పట్టణములుగను, పట్టణములు పల్లెలుగను బరిణమించినవి. ఈమధ్య నొకనాటి సాయంకాలము నీలమ్మ తమ్మునితో బంతమువైచి, తీరమును తాకెడి పెద్దయలలలోనుండి దుముకుచు నొడ్డున చాల దూరము పరుగిడిపోయెను. అపుడు వారికన్నుల కొక వింతదృశ్య మగపడెను. వయసువచ్చిన మనుష్యులు కొందఱు, చిన్నపిల్లలవలె, ఒకరిచేత నున్న వస్తువుల నొకరు పెఱుకుకొన బెనగులాడుచుండిరి. కొందఱు తెల్లని టోపీలు పెట్టుకొని, రంగుజెండాలు చేతబట్టుకొని నిలుచుండిరి. సమాచారము కనుగొనెదమని యాపిల్ల లిరువురును ఆగుంపుదగ్గఱకు బరుగెత్తిపోయిరి. సముద్రపు పక్షుల బంపు కాఱుప్పును బిడికెండ్లతో బట్టుకొని యైదాఱుగురు యువకులు నిలుచుండిరి. వారదివఱకు ద్రోగుచేసి గుడ్డలలో మూటగట్టిన యుప్పును వారిని ముట్టడించిన సర్కారుభటులు స్వాధీనపఱచుకొని, అంతటితో దనివినొందక, టోపీల పిన్నవారల చేతుల నుండిన యుప్పుకణములనుగూడ గైకొన బ్రయత్నించుచుండిరి. చిన్నయుప్పురాలకై పెద్దవారిట్లు పెనగులాడుటయందలి సరసత ఆపిల్లలకు బోధపడలేదు. ఎట్టకేలకు, రక్షకభటులు జెండాలయువకుల చేతుల నుండి యుప్పునంతటిని వశపఱచుకొనిరికాని, వారిలో నొకడుమాత్రము తన పిడికిలిని వదలకుండెను. రక్షకభటులు వేర్వేరుగను, కలసియును, ఆయువకుని గుప్పిలి సడలింప నెన్నియో యుపాయములు చేసిరికాని, అన్ని

యునిష్ఫలమయ్యెను! అంత జెండాలవారు తమమార్గమున దాము పోయిరి. రక్షకభటులు, అచట ప్రోగుపడి యుండిన యుప్పురాసులను మంటిలో గలిపివైచి, మఱి వెడలిపోయిరి.

3

పిల్లలలో ననుకరణశక్తి మెండు. దారిపొడుగునను నీలమ్మయు, తమ్ముడును రక్షకభటులు, లవణసత్యాగ్రహులును జేసినచొప్పున, ఇసుకతో నింపిన యొకరిగుప్పిలి నొకరు విడిపింప బ్రయత్నించి వినోదించుచుండిరి. వారు పల్లెవాడచేరుటయె తడవుగా, ఇసుకబట్టిన పిడికిలిని సడలించుట ఆప్రాంతముల పిల్లలకు వేడుకయాట యయ్యెను. రాత్రి కూడుతినుసమయమున నీలమ్మ తన తల్లిదండ్రులకు దా మానాడు చూచిన సంగతి వర్ణించిచెప్పెను. తోడనె యావార్త పల్లె యంతయు వ్యాపించెను. ఇట్లు పండ్రెండువందలమైళ్ల దూరమున పశ్చిమసముద్రతీరమున గాంధిమహాత్ముడు పన్నిన లవణవ్యూహరహస్యము, తూర్పున తెలుగుదేశమందలి కుగ్రామమగు నీలివాడకు బ్రాకి ప్రకటితమయ్యెను.

౪

దళాధిపతి ప్రసాదరావుచౌదరి తన యిరువది మంది శాంతిసైనికులను వెంటనిడుకొనివచ్చి, కొన్ని దినములక్రిందటనె నీలివాడకు క్రోసుదూరమున నున్న సైకతస్థలమున దన శిబిర మేర్పఱుచుకొనెను. సముద్ర తీరమున నచ్చటచ్చట లభ్యమైన యుప్పును తన సహచరులచే నాతడు ప్రోగుచేయించి, సంచులతో దానిని మండలమందలి యితరసత్యాగ్రహదళము లుండెడి తావులకు బంపుచుండెను. అంత నది దేశములో నమ్ముడు వోవుచుండెను. లవణశాఖవారు రక్షకభటుల సాయము గొని, ఈశాంతిదళము ప్రోగుచేసిన యుప్పును అథాత్తుగ నప్పుడప్పుడు పట్టుకొని, అట్టిప్రదేశములం దుత్పన్నమైన యుప్పురాసులను బాడుచేయుచుండిరి. కాని, వార లనుకొనునంత సులభముగ శాంతిసైనికులు తమ చేతికి జిక్కిన యుప్పు నిచ్చివేయువారు కారు. ప్రసాదరావుచేతిది గట్టిపట్టు! చేతనున్న యుప్పును శత్రువశము చేయుటకన్న, తనప్రాణముసైన గోల్పోవ సిద్ధముగ నుండున ట్లాతడు గానబడెను. ప్రభుత్వోద్యోగు లొకచోట నుప్పురాసిని బాడుచేసినచో, వెంటనే పది తావులందలి మేలిరాసు లాతని కనులకు గానవచ్చుచుండును. కావున నిట్టిపగతుని ధారాళముగ జయింప వలనుపడక రక్షకభటులు వీనిని మాయోపాయమున భంగపఱుప బ్రయత్నించుచుండిరి.

ఒకనాడు వేకువనె ప్రసాదరావు పడకవిడిచి' తా నెచటికి బోవునదియు శిబిరములోని సహవాసులకు జెప్పక, ఒంటరిగ బయనమయ్యెను. తూర్పురేక లింకను ఆకసము నలంకరింపలేదు. తానొకడె యా యెడారిని బడి పోవుచుంటినని యాయువకుడు తలంచినను, ఇరువురు పురుషులు వాని జాడలు కనిపెట్టుచు, మెల్ల మెల్లగ వానిని వెంబడించిరి. వీరు రక్షకోద్యోగులు. సమయము చూచి రహస్యముగ వీనికి శాస్తిచేసినచో, వాని యనుచరులు నిరుత్సాహులై యచటినుండి శిబిర మెత్తివేయుదురని వారి యాలోచన.

ఈకనుచీకటిసమయమున నెడారిని బడి తా నాత్రమున నొంటరిగ బయనముచేయుచుండుట తలపోయగా, ప్రసాదరావుచౌదరి మనసున నాశ్చర్యము పొరలిపొరలి వచ్చెను. నెలదినములక్రిందనేకదా యాతడింకను కళాశాలలో జదువుసాములు సాగించుకొనుచుండెను. ఇంతశీఘ్రముగ పుస్తకము మూలవైచి జెండా చేతబట్టుదునని కలనైన నాత డనుకొనలేదు. పెద్ద సుడిగాలి వీచునపుడు, చిన్నిమొలకలు మొదలుకొని మహావృక్షములవఱకును, చెట్లన్నియు నూగాడజొచ్చును. సబర్మతీ తీరకుటీరనివాసియగు నొక మానవమాత్రుని చేసైగనెకదా, భారతదేశమంతటి నొక్కపెట్టున గలంచివైచిన యీ మహావాయు వుద్భవమయ్యెను! చిన్ననాటినుండియు నాయువకుని కుత్సాహజనకములైన యాశలు, నాశయములు నివు డేమైపోయినవి? పుడమియందలి నదులన్నియు తుదకు సముద్రగత మగునట్లు, ప్రజలందఱి కోరికలును గాంధిమహాత్ముని మహోద్యమమున గలపిపోయెనే! భరత దేశమందలి ప్రతిభావంతులు,

గాంధిమహాత్ముని మహాశయములె తమ యాశయములని తలపోయుచు, నోరుమెదపక, ఆవీరుని పాదచ్ఛాయల నడుగులువెట్టుచున్నారే! ఇదియెకదా మహాపురుషుని వ్యక్తిత్వమునకును, సామాన్యమానవప్రకృతికిని గల తారతమ్యము!

౫

ఇట్టి యూహాపరంపరలో నిమగ్నుడై నడచుచుండెడి యాయువకు డంత తనకాలికి నేలలో గొంత భేద మగపడగా, అథాత్తుగ నిలిచి, చేత గొంతయిసుక తీసి, ఒకటిరెండు కణములు నోటవేసికొని రుచిచూచి యుప్పని గ్రహించి, అచట తన జెండా పాతెను. ఉప్పునేల యెంత మేఱ వ్యాపించెనో చూతమని యపుడాతడు వంగి చేతితో భూమి నచ్చటచ్చట తడివి పరిశీలించుచుండెను. ఇంతలో వెనుకనుండి యథాత్తుగ వాని శిరస్సునను, వీపుమీదను లాటీకఱ్ఱపెట్లు శరవేగముగ గురిసెను. "హరిహరీ! గాంధీకి జై!" అనుమాటలు తడబడుచు నుచ్చరించి ఆయువకుడు స్మృహతప్పి నిలువున బడిపోయెను. తాము దిగ్విజయము చేసినట్టుగ మోదమందియు, దొంగతనము చేసినట్టుగ దొట్రుపడి, పగతు రంత పలాయితు లయిరి.

౬

ఆనాడు సూర్యోదయసమయమున నీలమ్మ సముద్రతీరమున సోదరులతో గలసి యాటలాడుచుండెను. ఈమూఱు అన్నయు వారలతో గూడియుండెను. చెల్లెలికంటె అన్న రెండుమూడేండ్లు మాత్రమె పెద్ద. వాడిపుడు తండ్రిచేతి కంది యింటిపనులలో నాతనికి దోడుపడుచుండెను. ఐన నపుడపుడుమాత్రము, మొన్నమొన్ననె కడచిపోయిన వాని బాల్యక్రీడాదినములు వాని మనస్సున మెరమెరలాడుటచేత, పనినుండి వాడొకటిరెండురోజులు ఆటవిడుపు గైకొని, తోబుట్టువులతో దిరుగాడుచుండును. ఈనాడాముగ్వురు పిల్లలును, అలలను దప్పించుకొని దుముకులాడుచు, తమలో దాము పంతములువైచుకొని నీటియొడ్డున చాలదూరము పరువులెత్తిరి. ఒడ్డున కనతిదూరమున నంత నొక రంగుజెండా కనబడి వారు నిలిచిరి. అపుడు నీలమ్మ, "అన్నయ్యా! నేను, తమ్ముడును మొన్న చూచిన జెండాలిటువంటివె సుమీ. అక్కడ యింకా కొన్ని జెండాలుండును. పోయి చూదాము రండి!" అని పలికి, తానచటికి దారితీసెను. సోదరివెంటనే యన్నదమ్ములాత్రోవను నడచిపోయిరి.

అక్కడ మఱి యేజెండాలుగాని, మనుష్యుల జాడగాని కానరాకుండుటచేత, తిరిగిపోవుద మని అన్నయు దమ్ముడును చెప్పినను, తనకంటికి నిసుకమీద నల్లగ నేదో దూరమున గనబడుచున్నదని నీలమ్మ పలికి, తానచటికి బరుగెత్తిపోయి, "అన్నయ్యా, ఇటురండి. ఇక్కడెవడో మనుష్యుడు పడిపోయినాడు!" అని కేకవేసెను. వారిట్లు చూచినది నాడు వేకువనె రక్షకభటుల క్రూరప్రహారణములబారి పడిన శాంతిదళాధిపుడు ప్రసాదరావె!

౭

నాడు పోలీసుల నెవరినిగాని తన పిడికిలినుండి యుప్పుగైకొననీయని మేటిబలవంతుడై నేడు నేలబడియుండుటకు నీలమ్మ మిగుల వగచెను. శరీరచలనము లేని యీతడు మృతుడయ్యెనని యాబాలిక భావించెను. ఆబలాధికునిమీద నీర్ష్యచేతనె వైరులాతని కిట్లు చేసిరని యాచిన్నది తలంచెను. తామింటికి జని పెద్దవారితో నీసంగతి చెప్పుదమని యన్నదమ్ము లనిరి. శవమునొద్ద నిలువరాదని యన్న చెల్లెలిని వారించెను. కాని, యాశాంతిసైనికుని కింకను కొనయూపిరి యుండవచ్చునని నీలమ్మనమ్మకము. కావున నాముగ్వురుపిల్లలును పడిపోయిన యువకుని ప్రయాసమున వెలికిల బరుండబెట్టిరి. అంత, చెల్లెలియాలోచనచొప్పున రోగికి గొంతుక తడుపుట కెచటనైన మంచినీరు తెచ్చుటకై అన్న బయలుదేఱెను. ఊపిరి సరిగా విడుచుట కిపుడనుకూలముగ నుండుటచేత, ఏకోశముననో ప్రాణలేశమంటిపెట్టుకొనియుండిన యాశాంతిసైనికుడు, అంత మెల్లమెల్లగ శ్వాసము విడువజొచ్చెను. ఒక తాటియాకుదొప్పతో నిపుడు అన్న తెచ్చిన నీటితో, చెల్లెలు

"...నేడు. నేలబడియుండుటకు నీలమ్మ మిగుల ఖేదపడెను"

రోగిమొగము గడిగి, ఒకకొన్ని నీటిబిందువులు వాని నోట మెల్లగ బోసెను. అవి గుటకపడినవి! ఇట్లు శీతలోపచారములు చేసి, మృత్యుముఖమునుండి యీ యువకుని యసువులు దక్కించితిమని యాపసివారు మిగుల ముదమందిరి. వాని కింకను స్పృహ రాకుండినను, ప్రాణములు నిలిచె ననుట స్పష్టమయ్యెను. ప్రచండ భానుని కెదురుగ మండుచుండెడి యిసుకనేలలో వాడు పండుకొనియుండుట ప్రాణోపద్రవకరమని వా రెంచి ఎటులైన వానిని దమగ్రామము జేర్చుట కాలోచించిరి. అక్కయును దమ్ముడును రోగిమీది కెండ రాకుండ జూచి వాని కుపచారములు సలుపుచుండునట్లును, ఈలోపుగ అన్న వేగముగ బోయి తమయూరివారి కీవార్త చెప్పి వారిని గొనివచ్చుటకును వా రేర్పఱచుకొనిరి. ఒకగంటలోనె నీలివాడగ్రామస్థులు సవారిలో ప్రసాదరావును తమయూరికి గొనివచ్చిరి. నీలమ్మ కుటీరముప్రక్కనుండు గుడిసియె రోగికి విడిది. ఆతని దేహమునందలి దెబ్బలకు, గాయములకు నపుడు మందులు పట్టించిరి. రోగి నోట మెల్లమెల్లగ పలుచని జావ పోయుచు నీలమ్మయు, ఆమెతల్లియు వాని మంచము నొద్ద గనిపెట్టుకొనియుండిరి.

౮

రాత్రికి ప్రసాదరావు కొంత తెప్పిరిల్లెను. స్పృహవచ్చి యాత డిటునటు తేఱిపాఱచూచెను. తా నొక గుడిసెలో మంచముమీద బండుకొనియుండుటయు, పల్లెవారు తన కుపచారములు సలుపుచుండుటయు గనిపెట్టి, ఇది పల్లెకలయని యాతడు మొదట తలంచెను. తన యొడలిమీది గాయములు తడివిచూచుకొని, రోగి నిట్టూర్పు విడిచెను. బాధచేతను, నీరసముచేతను ప్రసాదరావు మూలుగుచు, హీనస్వరమున దన జెండా యేమయ్యెననియు, తా నెచట నుంటిననియు వారలను ప్రశ్నించెను. సత్తువచేరుట కింకకొంత జావ పోసి, అతని జెండా సురక్షితముగ నచటనె యుండెననియు, వాని సమాచారము క్రమముగ నెఱిగింతుమనియు, వాడేమియు నలజడిపడ నక్కఱలేదనియును, తల్లియు, కూతురును వాని నూరార్చిరి. పతాకము

సురక్షితమని వినునపుడు సైనికుని ముఖకమలము సంతసమున వికసనమందెను.

క్రమక్రమముగ ప్రసాదరావునకు తెలివివచ్చెను. పల్లెకన్నియవలన దన ప్రస్తుతసమాచారము విని యాత డాశ్చర్యమందెను. గ్రామస్థులును, ముఖ్యముగ నింటివారును, తనకు జేసిన సహాయసపర్యల కాతడు కృతజ్ఞత కలిగియుండెను. దైవసంఘటనము లెంత విచిత్రము! ఆంపటికంటెను నీలమ్మ యాతని కిపు డాప్తురాలయ్యెను. అత్యధిక బాధాపీడితుడై, కాలుసేతులు గదుపుకొనుటకైన శక్తిలేని యాయసహాయస్థితిలో, తన కీ యబలను రక్షకురాలినిగ జూపినందు కాయోధుడు దేవుని బొగడెను. నీలమ్మయె వాని కిపుడు తల్లియు, నేడుగడయు!

౬

మఱునాటి యుదయమునకు శాంతిసైనికులు వెదకికొనుచు వచ్చి, నీలివాడలో నీకుటీరమున బడియుండిన తమ నాయకుని గలసికొనిరి. శత్రువుల దౌర్జన్యమున కాహుతిగావలసిన తమ చెలికాని యసువులు, ఈ యూరివారి సాయమునను, ఈ పల్లెపిల్లల సౌజన్యమునను, నిలిచియుండుటకు వా రెంతయు సంతసించిరి. అనుంగుమిత్రుని దమబుజములపై నుంచుకొని శిబిరమునకు గొనిపోవలెనని వారు మొదట సంకల్పించిరి. కాని, యిట్టిస్థితిలో రోగిని గదుపుట యుక్తముకాదని గ్రామవాసులు వారించిరి. రోగియభిప్రాయము నదియె. ఎట్టియుద్రేకమునకు నవకాశమీయని యానిశ్శబ్దప్రదేశమునసే యుండినచో, కొలది దినములలోనే తమ నాయకుడు స్వస్థుడగునని సైనికులును దలంచిరి. కావున ప్రసాదరావున కాపల్లెవాడ మఱికొన్నిరోజులవఱకును నివాసస్థలమయ్యెను.

నానాట ప్రసాదరావునకు శరీరము నెమ్మది నొందెను. గాయములు మానజొచ్చెను. జ్వరము నివారణమయ్యెను. నీరస మొకటితప్ప వాని దేహమున నిపుడేలోపము గానిపింపదు. తక్షణమె తన శిబిరము జేరి, తన కార్యము లేల తాను చక్కబెట్టుకొనరాదని యాయువకుడు విసువునొందెను. ప్రపంచరంగమంతయు కార్యమయమై యుండగా, తా నీమాలమాలపల్లెలో హాయిగ పాన్పుమీద బవళించి, తన ప్రజ్ఞాపౌరుషముల నన్నిటిని జోకొట్టి నిద్రపుచ్చుచుంటినని యాశూరుడు తన్నుదాను నిందించుకొనెను. ఆవీరుని మన స్త్రీవ్రత మేదేని కార్యసాధనమునగాని యుపశమింపదని యాలోచించి, నీలమ్మయు దల్లియు వానిని జూచి, "అయ్యా, మీరు తెలిసినవారు. ఇక్క డెవరికిని చదువురాదు. గాంధీమహాత్ముని ప్రభ దేశమంతా మోగిపోతున్నది. ఆసంగతు లేమైనా మావాళ్లకు మెల్లగ చెప్పగలరా?" అని యందించిరి. తనకోర్కె నేతిని బడెగదా యని యాయువకుడు సంతసించి, అట్లే చేతు ననెను. ఇటు లాపల్లెవాడయందు దేశపరిస్థితులు, లవణసత్యాగ్రహము, స్వరాజ్యసంపాదనము — మొదలగువిషయములనుగుఱించి సత్యాగ్రహుల యభిప్రాయములు వ్యాప్తము లయ్యెను.

ఒకనాడు ప్రసాదరావుతో నీలమ్మతల్లి, "మా పల్లెవాళ్లకు కూటికి లేకున్నను, కల్లుకర్చు తప్పదు! నాయనా!" అని మాటలసందర్భముననసెను. ఇది నిమిత్తముగా ప్రసాదరావు మద్యపాననిషేధమును గుఱించి యచటి జనులలో కొంత ప్రబోధము గలిగించెను. అచ్చటివారు కల్లుసారాయిలు వర్జించునట్లు కృషి సల్పెను. నీలమ్మయింటినుండి యారంభమైన యీ సంస్కరణము కొలదిదినములలోనే గ్రామమంతయు వ్యాపించెను.

౧౦

ఇపుడు ప్రసాదరావునకు బరిపూర్ణారోగ్యము గలిగెను. దళనాయకుడు లేని శిబిరము జీవములేని కళేబరమువలె నుండెనని సైనికులు చెప్పిరి. తాను బోయి వచ్చెదనని యింటివారియొద్దను, గ్రామస్థులయొద్దను ఆయువకుడు సెలవుగైకొనునపుడు, ఉభయపక్షముల వారును విశేషభావోద్రేకపూరితులైరి. ఆసజ్జనుని హితబోధనము ననుసరించి తమ దినచర్య నడపుకొందుమని గ్రామపాస్తవ్యులు వాగ్దానముచేసిరి. తాముసు శాంతిసైన్యమున జేరుదుమని పలువురు యువకులు

గుడ్డజెండాలతో వానివెంట బయలుదేఱిరి. పల్లెవాడలో ప్రసాదరావు ప్రవాసదినములు వ్యర్థముగాకుండెననుట కివియె ప్రబలనిదర్శనములు.

ప్రసాదరావు చేపట్టిన యుద్యమ మాప్రాంతము లం దిపుడు బాగుగ జరుగుచుండెను. నాయకుడు మరల తమ్ము గలసికొనినప్పటినుండియు సైనికు లత్యుత్సాహమున దమ పనులు నెరవేర్చుచుండిరి. పల్లెపటాలపు పిల్లలా ప్రాంతపువారలె కావున, వారు గుట్టలుగుట్టలుగ సుప్పురాసులు దెచ్చి పేర్చుచుండిరి. మద్యపాననిషేధ ప్రచారము పల్లెనుండి పల్లెకు ప్రాకిపోయెను. అంత చుట్టుపట్టుల గ్రామములనుండి ప్రజలు గుంపులుగుంపులుగ వారి శిబిరమును జూడవచ్చుచు, కానుకలు, చందాలును గ్రుమ్మరించిరి. నిరుపేదలు ఉప్పు నేతి తెచ్చి యిచ్చుచుండిరి. ఇట్లు అర్థబలము, అంగబలమును సమృద్ధముగ గల యాశాంతిసైనికులు, తా మింక దుర్జేయులమనియె భావింపదొడంగిరి.

ప్రసాదరావుమాత్ర మట్లెన్నడును దలంచువాడు కాడు. ప్రథమమునుండియు నియమానుసారజీవితమున కభ్యాసపడి, పలుమా ఱాత డాత్మపరీక్ష చేసికొనుచుండువాడు. తన చదువుసాములును, ప్రజ్ఞాప్రతిభలును జూచుకొని విఱ్ఱవీగువాడు కాడు. కలిమియందు దాకువయు, లేమియందు దోరిమియు నియమములుగ జేకొనినవాడు. పరిస్థితులు తమ కిపు డెంత ప్రోత్సాహకరముగ నుండినను, భవిష్యత్తునం దవి తాఱుమాఱగునపుడు తా మెట్లు తెప్పిఱిల్లగలమా యని యాతడాలోచించుచుండును. ఆతనికి సత్యమె నిదానము; ధర్మమె కర్తవ్యము. సత్యదీక్షగల గాంధీమహాత్ముని యుద్యమమున బనిచేయువారలలో బలువురు ఆమహనీయుని సన్నియమముల నుల్లంఘించుచుండుట కాతడు వగచుచుండును. నిత్యబ్రహ్మచర్యదీక్షతో నుండవలసిన సత్యాగ్రహులలో ననేకులు సుఖలాలసులగుట యాతనికి దుఃఖావహముగ నుండెను. పగతురనైన ప్రేమింపవలెనుసుమీ యని సతతగురూత్తము డుపదేశించుచుండినను, అచటి శాంతిసైనికులు రెండుమూడుమాఱులు ప్రభుత్వోద్యోగులను బరిహసించి, వారియెడ దౌర్జన్యము చూప సిద్ధముకాలేదా?

చుట్టుపట్టుల పల్లెలవారు శిబిరమునకు వచ్చి, తనకు వేసెడి తెంపులేని ప్రశ్నములకు ప్రసాదరావు ప్రశాంతముగ సమాధానము లిచ్చుచుండుట వృథా ప్రయాసమని సైనికులలో పలువురి తలంపు. ప్రేమ, దయ, సత్యసంధతయును సత్యాగ్రహుల ముఖ్యసాధనకలాపమని దళాధిపతి వారల కొత్తిచెప్పుచుండువాడు. ఒకనా డొక పల్లెవాడు మాటాడుటకు సందేహించుచు, ప్రసాదరావు ప్రోత్సహింపగ నిట్లు పలికెను: "అయ్యా, కల్లుతాగవద్దనికదా మీరు బోధిస్తున్నారు. చిన్ననాటి అభ్యాసాలు చక్కసారిగ కట్టిపెట్టడము సులభమా? 'పాడుకల్లు మానివేయండిరా!' అని నేను మాపల్లె పిల్లలతో నొక్కిచెప్పితే, 'చదువుకున్నవాళ్లు, సత్యాగ్రహీలు, కాఫీవ్యసనాలు కట్టిపెట్టినమరునాడు, మేము మా కల్లుముంతలు పగలగొట్టుతాము లే!' అన్నారు."

దీనికి ప్రసాదరావు తానేమియు సమాధానమీయక, చుట్టునుండు సోదరసైనికసమితిని జవాబు చెప్పుమనెను. కాఫీ నాగరికతకు చిహ్నమని కొందఱును, కల్లువలె కాఫీ కయిపుచేయదని కొందఱును, మద్యమునవలె దుర్వ్యసనలు కాఫీనుండి వెడలవని మఱి కొందఱును సమాధానము లిచ్చిరి. దళాధిపతి యపుడందుకొని, కల్లుకాఫీలు రెండును దేహమునకు బలమేమియు నీయక తాత్కాలికోద్రేకమును మాత్రము గలిగించెడి విషపదార్థములె యనియును, శరీరమునకు రెండును సమానముగ చెఱుపుచేసెడివె యనియును, తమ టీకాఫీల యలవాటు త్యజింపలేనివారికి మద్యము వర్జింపుమని పామరులకు బోధింప నధికారము లేదనియును తీరుపు చెప్పెను.

ఇట్లు ఆశిబిరమున కాఫీనీళ్లకొఱకు సైనికులు కొందఱు తెల్లవాఱనీయకుండెడి దురభ్యాసము తొలగిపోయెను. పల్లెలలోనివారు మద్యపానము వర్జించుటకు తగినంత ప్రోత్సాహ మపుడు గలిగెను.

౧౧

ముఖ్యపట్టణమందలి నాయకు లొకరొకరె బంధితులై కారాగృహమునకు బోవుటవలన, వెంటనె తన దళమును దీసికొని వచ్చి, తా నొక యున్నతపదవిని స్వీకరింపుమని ప్రసాదరావున కిపు డాహ్వానము వచ్చెను. ఈప్రాంతములం దిన్నాళ్లును సత్కారములు జరిగించిన శాంతిసైన్య మిపుడు తమ్ము వదలిపోవుట చుట్టుపట్టుల వారికి విషాదకరముగ నుండెను. తాను పోయివచ్చెదనని ప్రసాదరావు నీలివాడవారికి జెప్పినప్పుడు నీలమ్మ కంట నీరు పెట్టుకొనెను. ఎంతసేపటికిని ఆబాల యూరకుండినది కాదు. ఒడలెఱుగక యెడారిలో బడియుండిన తనను దన యింటికి జేర్చి లెక్కలేని యుపచారములు సలిపి, తనప్రాణములు గాపాడిన నీలమ్మ ప్రసాదరావునకు బ్రాణసమానగదా! అట్టి సుగుణమణిని సంతృప్తిపఱచుట యా శూరుని ముఖ్యవిధి. కావున నెటులో యాకన్య నొడంబఱిచి, స్వస్థచిత్తమున దా నాగ్రామము విడువవలెనని యా యువకునికోరిక. ఎట్టకేల కాబాలకు హృదయగతమగు వాంఛపోకడ లాతనికి దెలియవచ్చెను. ఆసుందరి కా యువకునిమీద జెప్పనలవిగాని ప్రేమ మేర్పడెను. ఇట్టి ధీరదాక్షిణ్యశీలుని దాను వరించి వివాహమాడకున్న దన జీవితము వ్యర్థమని యా మెలత తలంచెను. కులవిద్యాసంపదలం దధికుడైన యాశూరునకు తన కందని మ్రాని పండని యా బాల యావంతయు దలంపదయ్యెను.

ఇంక, ప్రసాదరావును గుఱించి యేమిచెప్పుము? మనసార వలచిన చేడియనెగాని తాను జెట్టపట్టనని చిన్ననాటనుండియు బ్రతినపట్టిన ఛాందసు డాతడు. ఆపల్లెపడంతి కులవిద్యాసౌభాగ్యము లాత డారయ లేదు. దైవసంఘటనము లెంతటి విచిత్రములో కాని, ఆముద్దియమోము గాంచిన నిమేషమునుండియె యా యువకుని డెంద మాలతాంగియందె యవలగ్నమై యుండెను. అంతటి సదయహృదయ నెన్న డాసరసుడు గాంచియుండలేదు. తా నెపుడైన బరిణయమైనచో, ఆచెలువనే స్వీకరింతునని యాచతురుడు తన హృదయమును సమాధానపఱచుకొనెను. మనమున నమ్మిన సత్యమును వలసినపుడు వెలిపుచ్చుట కా ధీరుడు వెఱచెడివాడు కాడు. ఐనను దేశమంతయు సంక్షోభించెడి యీయసమయమున పెండ్లిమాటలు తలపెట్టుట అనుచితముగదా! నీలమ్మయైనను ఆసరసుని తన నా తరుణముననె పరిణయముకమ్మని పట్టుపట్టునంతటి వెఱ్ఱిదికాదు. దేశపరిస్థితులు చక్కపడిన పిదపనైనను, తన వాంఛాసాఫల్యమున కావంతయైన నవకాశముగునా యనియె యా సుందరిసంప్రశ్నము. ఈ చిన్ని ప్రశ్నమునకు గల సమాధానమునందె యా సుదతి యాశాప్రపంచమంతయు కేంద్రీకృతమైయుండెను.

ఎట్టకేలకు మనసు దిట్టపఱచుకొని, ప్రసాదరావు చౌదరి, ఆపల్లెకన్నియ ముద్దువ్రేలి కొక ముద్దుటుంగరము పెట్టి ముద్దుపెట్టుకొనినపుడె ఆకలికిముఖకమలము కలకదేఱెను. ఇపు డచటికి వచ్చి బారులుతీరి నిలిచిన శాంతిసైనికుల నయనముల కాబాల పల్లెవాడయాడబడుచువలెగాక, ఏవీరపత్నివలెనో కానబడెను. శీలముతో గూడిన సౌందర్యవిభవ మెపుడు నిట్టిదియె. ఇపుడు నీలివాడకు వీడుకోలు చెప్పెడి శాంతిసైనికులు గాంధిమహాత్మునకును, ప్రేయసి నీలవేణితో గూడిన తమ ప్రియసేనానిమీదను అమితోత్సాహపూరితమగు జయధ్వానములు గురిపించిరి.

౧౨

ఇది జరిగి ప్రసాదరావు ముఖ్యపట్టణమునకు వచ్చిన కొలదిదినములకె యొకనా డాతనిని రక్షకభటులు బంధించి, మాఱుమూలగ్రామమున మకాము చేసియున్న న్యాయాధిపతియొద్దకు గొనిపోయిరి. నిందితుని ప్రతివాదనయె లేని యిట్టియభియోగములలో న్యాయనిర్ధారణమున కెంతకాలము కావలెను! దండనాధిపుడు విచారణముగించి, తనగదిలో గూర్చుండి తీర్పువ్రాసి బైటివసారాలోని రోదనశబ్దము విని, గవాక్షమునుండి వెలుపలకట్టె చూచెను. ఒక యువకుడు దూరమున నిలిచి, తన ప్రేయసి వీడుకోలుకొఱకు ప్రతీక్షించుచుండెను. అతడె నిందితుడగు ప్రసాదరావు.

ప్రియుడు కోమలిముంగురులు సరిచేయుచు, విలపింప వలదని యామెను వేడుచు, తన చేతిరుమాలతో ఆదీన

"తన చేతిరుమాలతో......కన్నీ రొత్తుచుండెను."

వదనకన్నీ రొత్తుచుండెను. ఏడాది తిరుగకయె తా నింటి కేతెంచెదనని యాకాంత నత డెంత యూరార్ప జూచినను, ఆయతివకనుదోయినుండి యశ్రుకణము లొలుకుచునేయుండెను. రాజరత్న మొదలియారు "రాతి గుండె న్యాయాధిపతి" యని పేరు మ్రోగినవాడు. పేరుపెంపులు, బిరుదుకితాబులును గుటిపించెడి రాజాను గ్రహసంపాదనమునకు దగిన యవకాశము లివియెకదా! ఐన నీ దృశ్యమునకు, శ్రావణ వర్ష మునకు నల్లరాల కొండ చెమ్మగిలునట్టుగ, ఆయుద్యోగి హృదయ మించుక మెత్తగిల్లెను. పరులకు మార్గప్రదర్శకుడు గావలసిన విద్యాధికు డగు ప్రసాదరావువంటి యపరాధికి తగిన శిక్ష వేయవలెనని యపుడె వ్రాసిన తీర్పుకాకితము నా న్యాయమూర్తి పట్టున చించివైచి, వేరొక కాకితము గైకొని, ముద్దాయి సత్యాగ్రహదీక్షను తీవ్రముగ నెఱప జూచెడి సాహసికు డైనను, కోమలహృదయుడగు నీ తరుణవయస్కునికి కొంతక్షమ చూపినచో త్వరలో నీతడె ప్రభుభక్తిపరాయణులలో మిన్నగ పరిణమింప గలడను విశ్వాసమున నాతనికి స్వల్పశిక్ష నొసంగుచున్నా నని తీర్పువ్రాసి, తన డెందమందలి యుమ్మలిక మొకింత యపనయించుకొనెను.

౧3

ఇదివఱకు జెప్పిన యుదంతములు జరిగి యిప్ప టికి సుమారు సంవత్సర మైనది. ఏడాది గిఱ్ఱున దిరిగి రాగా, మల్లెమొగ్గలతోను, మందవాయువులతోను గలసి మరల వసంతము నీలివాడగ్రామమున ప్రత్యక్షమయ్యెను. ఇపుడు నీలవేణి యెచట నున్నది? ఏమిచేయుచున్నది? కడచిపోయినది యొక వత్సరమె యని లోకము లెక్క వేసికొనుచున్నదికాని, నీలవేణియంతరంగమున కీలో పుగ సమకూరిన యనుభవసంచయము పదిసంవత్సర ములకు సరిపడియుండెను. ఇపుడు నీలవేణి సముద్రపు టొడ్డున నాళువచిప్పలేరుచుండెడి పల్లెబాలికకాదు. ఆసుదతిపేరు, ఆమెయూహలు, ఆమె యాదర్శములును పల్లెలు, పట్టణములును వ్యాపించియున్నవి. దేశహితైక బుద్ధితో ప్రియుడు కారాగారమున గాసిల్లుచుండగా, తాను స్వగ్రామమున విహరింప నిచ్ఛగింపక, ఆసుగుణ వతి స్త్రీలుసలుపు విదేశవస్త్రబహిష్కరణోద్యమమున బాల్గొనియెను. పగలంతయు నెండలో బజారులయందు నిలుచుండి, విదేశవస్త్రముల కొనబడువారి నవి కొన వలదని దైన్యమున వేడుచు, వారల చీవాట్లును, రక్షక భటుల కఠినచర్యలను లెక్కసేయక వినుల నెరవేర్చు నెలతలలో నీలవేణి మిన్నయయ్యెను. చెన్నపురినుండి యాహ్వానము రాగా నీలవేణి యంత నానగరమున కేగ,

యచిరకాలముననే యచటి నారీమణులకు నాయికయై, ఆంధ్రభామినులు ధైర్యస్థైర్యములకు బట్టుకొమ్మలని తమిళసుందరులు శ్లాఘించునట్టుగ మెలంగెను. నీలవేణి వంతటి రక్షకభటులు బంధించుట, అచటికిపుడు న్యాయాధిపతిగ నేర్పడిన రాజరత్న మొదలియారు ఆఱు నెల లాధైర్యవతికి కారాగృహశిక్ష విధించుట మున్నగు నవి వార్తాపత్రికల కెక్కిన చారిత్రకవిషయములె.

౧౪

భారతదేశోద్ధారకుడగు గాంధీమహాత్ముడును, భారతజనశ్రేయోభిలాషియగు ఇర్విన్‌ప్రభువును దేశమున శాంతి నెలకొల్పుటకు జేసికొనిన సమాధానము ననుసరించి కారాగారబంధితులైన సత్యాగ్రహు లొక్కరొక్కరె చెరసాలనుండి విముక్తులగుచుండిరి. వేలూరు కారాగృహమునుండి వెలువడిన నీలవేణిని సమ్మానించుట కేగిన దేశభక్తులలో ప్రసాదరావుచౌదరి యొకడు. అదివఱకే శ్రీకృష్ణజన్మస్థానమునుండి విముక్తుడై వచ్చిన చౌదరి యిపుడు తన ప్రేయసిని గలసికొనునపుడానందపరవశు డయ్యెను.

తనకు సుస్వాగత మిచ్చుటకు దనవారు చెన్నపురి వచ్చి వేచియుండిరని వేలూరి కారాగృహముఖద్వారమున భ్రియునివలన వినిన నీలవేణి యంతట వారినిగాంచ నువ్విళులూరుచుండెను. చెన్నపురి రెయిలుస్టేషనులో నడుగిడునప్పటికె సత్యాగ్రహప్రముఖులును, నీలివాడ బంధువులును ఆమెను పూలమాలలతో ముంచివేసిరి. ఊరేగింపుటుత్సవము జరిగినవెనుక నిశ్శబ్దముగు నేచిన్న యింటనో తనకేర్పఱిచిన బసకు దనను వారు కొనిపోవుదురని యాతరుణి యనుకొనెనేకాని, అలంకృతమై జనావళిచే బరివేష్టితమైన యొకసుందరభవనమునకు దానపు డేతెంచి, అచట గల్యాణమంటపమున వివాహ వేదిక నధిష్ఠింతునని యాకలికి కలలోనైన దలంపలేదు. ఇంత యాకస్మికముగ, నింత సంపూర్ణముగ దన భాగ్యము ఫలించునని యాపడతి యెన్నడును భావింపలేదు. ఆసుందరి యిపుడు తన యదృష్టమును దలపోయుటకును, తన నెచ్చెలులను బలుకరించుటకును వ్యవధానము గాంచకుండెను. ఇపుడిచట గూడిన ప్రేక్షకుల వదనములు, పురోహితుని, పలుకులు, ప్రాణేశుని పాణిగ్రహణము, సభాసదుల యాశీర్వాదములు, బంధుజనుల కానుకలు, మిత్రుల యభినందనములు- ఇవి యన్నియు నీలవేణికి గలలో గనిన విషయములవలె దోచెను.

ఆనాడు వధూవరులను, వారి యాంతరంగిక మిత్రులను ఆశ్చర్యవాహినిని ముంచివేసిన యొక యుదంతమునుగూర్చి యిచట బ్రస్తావింపక తీఱదు. సదస్యులు చందనతాంబూలాదులు స్వీకరించి తమ నెలవులకు వెడలిపోవుసందడిలో, అపుడె వీథిలో నిలిచిన మోటారుబండిలోనుండి వచ్చి యొక భాగ్యవతి వివాహవేదికనుండి దిగుచుండెడి వధువు మెడలో నొక హారము వైచి, పెండ్లివారి సపర్యలు పూర్తిగ గైకొనకయె వేవేగమె బండియెక్కి వెడలిపోయెను. విలువగల యాయాభరణము సమర్పించిన పుణ్యవతి యెవ్వరో తెలిసికొని, ఆమెకు దమ కృతజ్ఞత జూప బెండ్లివారికి వలను పడకుండెను. అంత వరుడు ప్రసాదరావుచౌదరి మిగుల ప్రయాసమున జేసిన విచారణపర్యవసాన మేమన, పెండ్లికూతురి మెడలో హారమువైచిన సుదతీమణి న్యాయమూర్తి రాజరత్న మొదలియారిగారి ధర్మపత్ని యనియె.